


ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో జరిగిన రైతు నిరసన సభలో కేటీఆర్‌కు నాగలిని బహూకరిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తదితరులు, సభకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన రైతులు

# హామీల ఎగవేతపై నిలదీతే

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించిన నిరసన సభకు హాజరైన కేటీఆర్ మాట్లాడారు. అంతకుముందు నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోనూ ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీని రాహుల్‌గాంధీ చౌకీదార్ అంటే.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయనను బడేభాయ్ అంటారని, అదానీని రాహుల్ ఫ్రాండ్ అంటే.. రేవంత్‌రెడ్డి దోస్త్ అంటారని ధ్వజమెత్తారు. సభకు రైతులు భారీగా వస్తున్నారని, మీ కోసం పోలీసులూ వస్తున్నారని మాజీమంత్రి జోగు రామన్న తనకు ఫోన్ చేసి చెప్పారని, ఎందుకని అడిగితే.. కాంగ్రెస్ నేతల ఫిర్యాదుతో ఉట్నూరు స్టేషన్‌లో కేసు పెట్టారని, జైలుకు ఎత్తుకుపోతారని చెప్పారని పేర్కొన్నారు. రైతులు, ప్రజల కోసం ఏడాది, రెండేళ్లు జైలులో ఉండేందుకు కూడా తాను సిద్ధమని స్పష్టం చేశారు.

### చిట్టినాయుడు లెక్కే కాదు

తెలంగాణ ఉద్యమంలో రాజశేఖరరెడ్డి, చంద్రబాబు వంటి నాయకులతోనే కొట్లాడామని, ఈ చిట్టినాయుడు ఎంతని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరిట ఆదిలాబాద్‌లో ఇండ్లు కూల్చేందుకు వచ్చిన అధికారులతో ఒక్క మాట అన్నందుకు బొడిగం గంగన్న అనే వృద్ధుడిపై కేసు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఇష్టం వచ్చినట్టు పేదలు, రైతులపై కేసులు పెడతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసిన రుయ్యాడి గ్రామంలో రైతులపై కేసులు పెట్టారని తెలిపారు. రైతుల కోసం తాము కాంగ్రెస్ నాయకులతో కొట్లాడి జైలుకెళ్తామని, రైతులు, ప్రజలు తమకు శక్తినిస్తే తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ నాయకత్వంలో కొట్టాడినట్టు కొట్లాడతామని చెప్పారు. నాడు తెలంగాణ ఉద్యమంలోనూ ఆదిలాబాద్ ముందున్నదని కేటీఆర్ గుర్తుచేసుకున్నారు. నవంబర్‌లో మహారాష్ట్ర ఎన్నికలు జరుగుతున్నాయని, జిల్లా వాసులు అక్కడ ఉన్న తమ బంధువులకు కాంగ్రెస్ మోసాలపై వివరించాలని, కాంగ్రెస్ అడ్డగోలు హామీలను వారికి తెలియజేయాలని కోరారు.

### వారు పార్టీని వదిలినా ఢోకా లేదు

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం జనావాసాలకు, రైతు వ్యవసాయ క్షేత్రాలకు దూరంగా స్థలం చూపిస్తే, కాంగ్రెస్ వచ్చాక రైతులకు అన్యాయం జరిగేలా ఫ్యాక్టరీ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. దానిని అడ్డుకునేందుకు తమ పార్టీ పోరాడుతుందని తెలిపారు. పదేండ్లపాటు అధికారం అనుభవించిన కొందరు సీనియర్లు పార్టీ వదిలిపెట్టి వెళ్లినా బీఆర్‌ఎస్‌కు ఎలాంటి ఢోకా లేదని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రైతుభరోసా, రుణమాఫీ చేయనందుకు కాంగ్రెస్ వెంట పడినట్టుగానే పత్తి ధర విషయంలో బీజేపీతో కొట్లాడతామని చెప్పారు. ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను ప్రారంభిస్తామని బీజేపీ నేతలు చెప్పారని, కేంద్రమంత్రి అమిత్ షా, బీజేపీ ఎంపీలు సీసీఐని తెరిపిస్తామని మాటిచ్చారని, ఎమ్మెల్యే చెప్పినా ఏమీకాలేదని విమర్శించారు.

### డిక్లరేషన్లు ఏమయ్యాయి?

పంచాయతీ, జడ్పీ ఎన్నికల్లో బీసీ సోదరులకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. సంవత్సరం గడిచినా అమలు కాలేదని, బీసీ సబ్‌ప్లాన్ కింద ఏడాదికి రూ.25 కోట్లు, ఐదేళ్లలో రూ. లక్ష కోట్లు ఇస్తానని చెప్పారని, మైనార్టీ డిక్లరేషన్, ఎస్సీ డిక్లరేషన్, మహిళా డిక్లరేషన్, యువత డిక్లరేషన్, విద్యార్థి డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



### కాంగ్రెస్‌కు సంవత్సరీకం పెడతాం

కాంగ్రెస్‌పై పోరాటం ఇప్పుడే మొదలైందని, ఇంకో నాలుగు రోజులు అయితే సంవత్సరం నిండుతుందని, సంవత్సరీకం పెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లో రైతుల కోసం మాజీ మంత్రి జోగు రామన్న కదిలారని, అలాగే బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఉమ్మడి జిల్లా నాయకులందరూ కదలాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి వచ్చేంత వరకు విడిచిపెట్టే ప్రసక్తే లేదని, పోరాటం చేస్తామని చెప్పారు. కేసీఆర్ మతం పేరిట రాజకీయాలు చేయలేదని, మనిషిని మనిషిగా చూస్తూ అందరికీ ప్రయోజనాలు అందించినట్టు తెలిపారు. బతుకమ్మ పండుగకు చీరలు, రంజాన్‌కు తోఫాలు, క్రిస్మస్‌కు గిఫ్టులు అందజేసినట్టు చెప్పారు. అదానీకి పరిశ్రమలు కట్టబెట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, నల్లగొండ జిల్లా రామన్నపేటలో అదానీ సిమెంటు ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా స్థానికులు ఆందోళన చేపట్టారని, బెల్లంపల్లిలో ఓరియంట్ సిమెంటు పరిశ్రమను, ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను అదానీకి కట్టబెట్టడానికి చర్యలు చేపట్టిందని విమర్శించారు. సింగరేణినీ అదానీకి అప్పచెప్తారని, పరిశ్రమల విషయంలో మనం గట్టిగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవ లక్ష్మి, సంజయ్, కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు.

> కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే. గుజరాత్‌లో పత్తి పండించేది రైతు అయితే తెలంగాణ రైతు రైతు కాదా? గుజరాత్‌లో క్వింటాలు పత్తికి రూ. 8,800 చెల్లిస్తున్నట్టుగానే ఆదిలాబాద్ రైతులకు కూడా ఇవ్వాలి. లేదంటే బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను వదిలిపెట్టబోం. - కేటీఆర్

> మాపై కేసులు పెట్టడం కాదు.. కల్యాణలక్ష్మిలో భాగంగా ఇస్తామన్న తులం బంగారం ఇవ్వనందుకు సీఎంపై పోలీసులు కేసు పెట్టాలి. రైతు భరోసా, రుణమాఫీ, 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసగించినందుకు చీటింగ్ కేసులు పెడితే ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా మిగలడు. -కేటీఆర్

> అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. మంత్రులు ఫోన్ చేయగానే పోలీసులు తొందరపడి ఆగం కావొద్దు. న్యాయంగా, ధర్మంగా నడుచుకోవాలి. పోలీసులు, అధికారులు ఎక్కువ చేస్తే వారి పేర్లు రాసుకుని మిత్తితో సహా తిరిగి చెల్లిస్తాం. -కేటీఆర్



### మా రైతులను రేవంత్ మోసం చేసిండు

రేవంత్‌రెడ్డి మమ్మల్ని మోసం చేసిండు. రుణమాఫీ చేస్తానని, రైతు భరోసా కింద ఎకరానికి రూ. 15 వేలు వేస్తానని ఎన్నికల్లో మాయమాటలు చెప్పాడు. ఇప్పుడు రబీ, ఖరీఫ్ సమయం వెళ్లిపోతున్నా రైతు భరోసా ఇవ్వడం లేదు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి ఆరు నెలలకోసారి రైతుబంధు డబ్బులు బ్యాంకులో జమ అయ్యేవి. కేసీఆర్ లాంటి దేవుడిని ఓడగొట్టుకుని రైతులందరం బాధపడుతున్నం. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే రైతులు ఆనందంగా ఉంటారు. అందుకే మేము రైతు పోరుబాటుకు వచ్చాం.

– భూమారెడ్డి, రైతు, కాప్రి గ్రామం, జైనథ్ మండలం, ఆదిలాబాద్

### రైతుభరోసా ఎక్కడ సార్?



**రైతు** భరోసా ఇప్పటి వరకు రాలే. రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ వచ్చినప్పుడు బాసర సరస్వతి దేవిపై ఒట్టువేశారు. ఆగస్టులో కొంత రుణమాఫీ చేసి చేతులు దులుపుకొన్నారు. సీఎం ఒక మాట, మంత్రులు ఒక మాట చెప్తున్నరు. రుణమాఫీని పక్కదోవ పట్టించేందుకు హైడ్రా పేరుతో పేదల భవనాలను కూలుస్తున్నరు. ఇలాంటి ప్రభుత్వం మాకొద్దు.

– జనార్దన్, రైతు, కుచులాపుర్ గ్రామం, తలమడుగు మండలం, ఆదిలాబాద్

## కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారిన తెలంగాణ

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారిందని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎన్నికల కోసం ఆ పార్టీ తెలంగాణను నిధిగా మార్చుకున్నదని ఎక్స్‌వేదికగా ధ్వజమెత్తారు. 'మహారాష్ట్ర ఎన్నికల్లో ఖర్చుపెట్టేందుకు తెలంగాణ నుంచి వందల కోట్లు వరదలా ప్రవహిస్తున్నాయి' అని అనురాగ్‌రెడ్డి చేసిన ట్వీట్‌కు ఆయన ఇలా బదులిచ్చారు. ఇటీవలి హర్యానా ఎన్నికల్లో, ఇప్పుడు మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఏటీఎంగా మార్చుకున్నదని ఆరోపించారు.

### ఉద్యోగుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి...

కాంగ్రెస్ పాపపు పాలనలో రాష్ట్రంలోని ప్రతీ బిడ్డా ఆగమేనని కేటీఆర్ పేర్కొన్నారు. సామాన్యులు మొదలు ప్రభుత్వ ఉద్యోగులు సైతం రోడ్ల పైకి వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాకులతో సస్పెన్షన్‌లు, హక్కులు అడిగితే వేటు వేయడమే పాలనగా కొనసాగుతున్నదని ఆరోపించారు. 2 లక్షల ఉద్యోగాలు రాహుల్ ఎరుగు, ఉన్న ఉద్యోగాలను రేవంత్ సర్కార్ ఊడగొడుతున్నదని విమర్శించారు. 165 మంది ఏఈవోలు, 20మంది కానిస్టేబుళ్లను ప్రభుత్వం సస్పెండ్ చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ అంటే ఉద్యోగుల సంక్షేమ ప్రభుత్వమని, కాంగ్రెస్ అంటే ఉద్యోగుల సంక్షోభ ప్రభుత్వమని అభివర్ణించారు. తమ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు అండగా ఉన్నామని గుర్తుచేశారు. సస్పెండ్ చేసిన ఉద్యోగులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులతో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## • గంగులకు కేటీఆర్ పరామర్శ



కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాతృమూర్తి లక్ష్మీ నర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. పక్కన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**కరీంనగర్** ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాతృమూర్తి లక్ష్మీనర్సమ్మ ఇటీవల మరణించగా.. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గంగుల కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ప్రగాఢ సంతాపం తెలిపారు. కేటీఆర్ వెంట రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, బాల్క సుమన్ తదితరులు ఉన్నారు. –కరీంనగర్ కార్పొరేషన్

